క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి



ముత్తంశెట్టికి ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో శ్రీనివాసరావు అందజేశారు.

డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాల సందర్శన



డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ శనివారం ఆరిలోవ, పెందుర్తి ప్రాంతాల్లోని డీఆర్‌డీఏ మహిళా ప్రాంగణాలు సందర్శించారు. శిక్షణ సమయంలో వారికి కావల్సిన మౌలిక వసతులతో పాటు భోజనం, తదితర వసతులపై కమిషనర్ ఆరా తీశారు. మహిళలు ఉత్తమ శిక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని శిక్షణ పొందుతున్న ఏఎన్ఎంలకు సూచించారు. శిక్షణలో ప్రావీణ్యం పొంది ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి పోటెత్తిన భక్తులు



సింహగిరిపై భక్తుల రద్దీ

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, దర్శనం క్యూలు కిక్కిరిశాయి. మధ్యాహ్నం రాజభోగం సమయంలో భక్తుల క్యూలు బారులు తీరాయి. దేవస్థానం బస్సులు, ఆర్టీసీ బస్సులురద్దీగా మారాయి.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామిని, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. పురోహిత్ అలంకారి కరిసీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు తోమాల సేవ

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై శనివారం వేంకటేశ్వరస్వామికి తోమాల సేవ విశేషంగా నిర్వహించారు. అర్చన, ఆరాధన, రాజభోగం వంటి పూజాదికాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ కార్యక్రమాలను నిర్వహించారు.

జై భజరంగ భళి

- భక్తులకు కొండంత అండ ఆంజనేయుడు
- నేడు హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆంజనేయుడంటే భక్తులకు కొండంత అండ. రెట్టించిన ధైర్యం. హనుమంతుడి గుండెల్లో శ్రీరామచంద్రుడు కొలువై ఉన్నట్టుగానే.. భక్తుల హృదయాల్లో భజరంగ భళి స్థానం పొందాడు. నాడు మహాభారత కురుక్షేత్ర సంగ్రామంలో అర్జునుడి రథంపై 'జెండాపై కపిరాజులా' ఉంటూ విజయ తీరాలకు చేర్చిన హనుమంతుడు.. నేడు ప్రతి ఊరిలో వెలిసి భక్తుల పాలిట ఆపద్భాంధవుడిలా పూజలందుకుంటున్నాడు. ఆదివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని నగరంలో వెలసిన హనుమంతుని భారీ విగ్రహాల్లో కొన్నింటి విశిష్టత తెలుసుకుందాం.

– విశాఖపట్నం డెస్క్

పంచముఖఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 4 అడుగులు
ప్రాంతం: సినిమాహాలుకూడలి, పరవాడ
నిర్మాణ కర్తలు:, జై పైడిమాంబ యూత్
విగ్రహావిష్కరణ: 2019లో పైడిమాంబ యూత్ నాయకులు, గ్రామపెద్దలు ఆవిష్కరించారు. .
ప్రాముఖ్యత: ఈ ప్రాంతంలో ఆంజనేయ స్వామి స్వయంగా వెలిశాడని ప్రతీతి. భక్తుల పాలిట కల్పతరువుగా స్వామి పూజలందుకుంటున్నాడు.

సంజీవ అంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 30 అడుగులు, (గ్రౌండ్ లెవెల్ నుంచి 40 అడుగులు)
ప్రాంతం: హనుమంతవాక జంక్షన్
నిర్మాణ కర్తలు: జీవీఎంసీ
ప్రాముఖ్యత: విశాఖలో హనుమంతవాకకు ఎంతో ప్రత్యేకత, విశేష చరిత్ర ఉంది. నగరానికే తలమానికమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం కైలాసగిరి.. ఇక్కడి కొండ మీదే ఉంది. ఈ ప్రాంతానికి గుర్తింపుగా మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచనల మేరకు జీవీఎంసీ ఈ విగ్రహాన్ని నిర్మిస్తోంది.
ప్రారంభం ఎప్పుడంటే..?: ఈ విగ్రహం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండు నెలల్లో పెయింటింగ్‌తో సహా మొత్తం పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించనున్నారు.

అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 16 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 21 అడుగులు)
ప్రాంతం: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్
నిర్మాణ కర్తలు: జ్ఞానాపురం పాత లారీ స్టాండ్ వర్తక సంఘం సభ్యులు
విగ్రహావిష్కరణ: 1990లో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: లారీ స్టాండ్ డ్రైవర్లు సుదూర ప్రాంతాలకు వర్తక, వ్యాపారాల నిమిత్తం రాకపోకలు సాగించేటప్పుడు అభయాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేసి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో వచ్చిన తర్వాత మళ్లీ ఆంజనేయ స్వామిని కొలుస్తారు. ప్రస్తుతం ఈ లారీ స్టాండ్‌ను షీలానగర్‌కు మార్చారు.

జింక్ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 45 అడుగులు
ప్రాంతం: గాజువాక ఆర్టీసీ డిపో వద్ద జింక్ స్థలంలో..
నిర్మాణ కర్తలు: దేవదాయ శాఖ
విగ్రహావిష్కరణ: ఈ విగ్రహాన్ని 2006లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తండ్రి తిప్పల దయాల్‌రెడ్డి ఆవిష్కరించారు
ప్రాముఖ్యత : పారిశ్రామిక ప్రాంతంలో ఇదే ఎత్తయిన హనుమంతుడి విగ్రహం. గాజువాక ఆర్టీసీ డిపో ప్రాంతంలో ఆలయ నిర్మాణానికి ముందు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగేవని.. ఆలయాన్ని నిర్మించి ప్రారంభించిన అనంతరం ప్రమాదాలు తగ్గాయని భక్తులు చెబుతున్నారు.

అభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 108 అడుగులు
ప్రాంతం: సీతమ్మధార కొండవాలు
నిర్మాణ కర్తలు: శ్రీ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి సత్యనారాయణరాజు (ఎ.ఎస్.ఎన్.రాజు), దాతలు
విగ్రహావిష్కరణ: 2021 డిసెంబర్ 8న పెందుర్తి శారదా పీఠాధిపతి స్వరూప నందేంద్ర సరస్వతీ మహాస్వామి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని సువిశాల సుందర ప్రదేశంలో నిర్మించిన 108 అడుగుల ఈ భారీ ఆంజనేయ విగ్రహం విశాఖలోనే అత్యంత పెద్దది.. ఎత్తయినది. ఆధ్యాత్మికంగా నగరానికి వన్నెతెచ్చింది.

మాతాభయ ఆంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 28 అడుగులు
ప్రాంతం: ఓల్డ్ డైరీ ఫారం జంక్షన్
నిర్మాణ కర్తలు: మాతాభయ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ పెద్ద, ధర్మకర్త బోను సత్యనారాయణ
విగ్రహావిష్కరణ: 2006లో ఆలయ ధర్మకర్త, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: జాతీయ రహదారిపై పాత డైరీ ఫారం జంక్షన్‌లో వెలసిన మాతాభయ ఆంజనేయుడు భక్తుల నుంచి విశేష పూజలు అందుకుంటున్నాడు. విగ్రహ నిర్మాణంతో ఈ ప్రాంతానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక్కడి స్వామిని కనులారా దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. చక్కని వాతావరణంలో ఆధ్యాత్మికతతో ఈ ప్రాంతం నిండి ఉంటుంది.

సుందర అభయాంజనేయ స్వామి



విగ్రహం ఎత్తు: 46 అడుగులు(గ్రౌండ్ లెవెల్ నుంచి 57 అడుగులు)
ప్రాంతం: తాటిచెట్లపాలెం జాతీయ రహదారి
నిర్మాణ కర్తలు: ఆలయ కమిటీ సభ్యులు
విగ్రహావిష్కరణ: 1996 మార్చి 7న నాటి మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ చైర్మన్ దివంగత టి.సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు.
ప్రాముఖ్యత: సుందర అభయాంజనేయ స్వామి భారీ విగ్రహ నిర్మాణాన్ని 1991లో పెద్దాపురం ప్రాంతానికి చెందిన పిండి కృష్ణ అనే శిల్పి ప్రారంభించారు. మరుసటి ఏడాది ఆయన మరణించడంతో ఆ బాధ్యతను ఆయన అల్లుడు రాజ్‌కుమార్ తీసుకుని భారీ విగ్రహం, ఆలయ నిర్మాణాలను పూర్తి చేశారు. నాడు నిర్మాణుష్యంగా ఉండే తాటిచెట్లపాలెం ప్రాంతంలో ఆధ్యాత్మికంగా వెలుగొందేలా.. ఓ ల్యాండ్ మార్క్‌లా నిలిచేలా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఎందరో భక్తులు ఇక్కడికి తరలివచ్చి అంజన్నను తిలకించి తరిస్తుంటారు.

తుప్పు.. సోలార్ వెలుగులకు ముప్పు!

- సాయంత్రం అయితే తీరంలో అంధకారం
- సోలార్ దీపాలు పునరుద్ధరించాలని విజ్ఞప్తి



తిక్కవానిపాలెం తీరంలో తుప్పు కారణంగా ఊడిపోయిన సోలార్ ప్లేట్లు, లైట్లు



ఉప్పుగాలికి దెబ్బతిన్న సోలార్ లైటు, ప్లేటు



ముత్యాలమ్మపాలెం తీరంలో వెలుగులు విరజిమ్ముతున్న సోలార్ లైట్లు(ఫైల్)

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల్లో సాయంత్రం అయితే అంధకారం అలుముకుంటుంది. పర్యాటకులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తీరం ప్రాంతంలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లకు ఉప్పు గాలి పెద్ద ముప్పుగా పరిణమించింది. రూ. లక్షల వ్యయంతో అమర్చిన లైట్లు తుప్పు పట్టి ఎందుకు పనికిరాకుండా పోయాయి.

ఇదీ పరిస్థితి

సువిశాలమైన తీర ప్రాంతాలకు వందలాది మంది పర్యాటకులు వస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తీర ప్రాంతాల ముస్తాబు చేయడానికి సింహాద్రి ఎన్టీపీసీ ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా నాలుగేళ్ల కిందట సుమారు రూ.10 లక్షల వ్యయంతో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాల వెంబడి సుమారు 80 సోలార్ లైట్లు ఏర్పాటు చేసింది. దీంతో సాయంత్రం వేళ కూడా సందర్శకులు హాయిగా గడిపేవారు. గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, పెందుర్తి, అనకాపల్లి, నర్సీపట్నం, మాకవరపాలెం తదితర సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల వెలుగులు పర్యాటకులను కనువిందు చేసేవి. లైట్ల వెలుగులో తీరం అందాలను పర్యాటకులు తమ కెమెరాల్లో బంధించడానికి మరింత ఉత్సాహం చూపేవారు. చీకటి పడినా సోలార్ లైట్ల వెలుగుల కారణంగా భయం లేకుండా పర్యాటకులు తీరంలో చాలా సేపు కాలక్షేపం చేసి ఇళ్లకు వెళ్లేవారు. పర్యాటకులతో పాటు మత్స్యకారులకు సోలార్ లైట్ల వెలుగులు అనేక విధాలుగా ఉపయోగపడేవి. రాత్రి సమయంలో చేపల వేటకు వీటి వెలుగులోనే మత్స్యకార్మికులు తమ వేట సామగ్రిని పడవలపై వేసుకొని వెళ్లేవారు.

సముద్రంపై నుంచి వీచే ఉప్పుగాలి ఆ పరిస్థితులను తలకిందులు చేసింది. తీరం వెంబడి కాంక్రీట్ దిమ్మలపై ఇనుప గొట్టాలు నిర్మించి వాటికి సోలార్ ప్లేట్లు, చార్జర్ లైట్లు ఏర్పాటు చేశారు. ఉప్పు గాలి ప్రభావంతో ఇసుక తిన్నులపై నిర్మించిన ఇనుప రాడ్లు, సోలార్ ప్లేట్లు, లైట్లు తుప్పు పట్టి ఎక్కడికక్కడ రాలిపోయాయి. విరిగిపోయిన ఇనుప పోల్స్, సోలార్ ప్లేట్లను స్థానికులు పట్టుకుపోయారు. స్తంభాలు మరమ్మతులతో మూలుగుతున్నాయి. ముత్యాలమ్మపాలెం తీరం వెంబడి నిర్మించిన సోలార్ లైట్లు కూడా చాలా కాలం నుంచి వెలగడం లేదని గంగపుత్రులు చెప్పారు. ఇక్కడ కూడా ఉప్పు గాలి ప్రభావంతో సోలార్ లైట్లు, సోలార్ ప్లేట్లు ఊడిపోతున్నాయి. ఈ తీరంలో నాలుగైదు లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. మూలకు చేరిన సోలార్ లైట్లకు మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకు రావాలని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సర్పంచులు చింతకాయల సుజాత ముత్యాలు, చేపల మసేను కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



నాయుడుపాలెంలో ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: నాయుడుపాలెం వాసుల విద్యుత్ కష్టాలు తీరాయి. సాక్షి దినపత్రికలో శనివారం ప్రచురితమైన ×కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వేయండి¥ కథనానికి ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా కొంత కాలంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. బల్బులు తప్పా మోటార్లు, ఏసీలు పనిచేయడం లేదు. ఫలితంగా గ్రామ ప్రజలు, చిన్నారులు, వృద్ధులు, వ్యవసాయదారులు నానా అవస్థలు పడుతున్నారు. సమస్య వెలుగులోకి రావడంతో ఈపీడీసీఎల్ పరవాడ ఏఈ శేషసాయి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు ఈపీడీసీఎల్ అధికారులతో పాటు సాక్షికి ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: నిర్వహణ పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. 93వ వార్డు పరిధిలోని శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, గొల్లనారాయణపురం, గణేష్‌కాలనీ, పాత గోశాల జంక్షన్, బాలాజీ గార్డెన్స్, ఆర్టీసీ డిపో ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుంది.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే లక్ష్యంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వవార్డు 495 సచివాలయం పరిధిలోని వుడాకాలనీ, రైల్వే విహార్, కార్మికనగర్‌లో శనివారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అవి ఏవిధంగా అందించాలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, నాయకులు కిల్లి అప్పారావు, విజయలక్ష్మి, రాంబాబు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు మాథ్స్ పజిల్స్, గేమ్స్‌లో మెలకువలు నేర్పారు. సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న రామముని దీప్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న చిన్న ఎంజాయ్ గేమ్స్, పజిల్స్ మానసిక వికాసానికి దోహదపడతాయని దీప్తి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా సింహాచలం యోగ విజ్ఞాన సమితి వ్యవస్థాపకుడు బి.బి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులతో ధ్యానం చేయించారు. స్థానిక వక్త భాను నీతి కథలు బోధించారు. లైబ్రేరియన్ నరసింహం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీపై వ్యతిరేకతకు కర్ణాటక ఫలితాలే నిదర్శనం

కూర్మన్నపాలెం: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కర్ణాటక ప్రజలు తమ వ్యతిరేకతను తెలియజేశారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 821వ రోజు ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ విభాగాల కార్మికులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

ఘనంగా మరిడిమాంబ ముఖద్వారం పూజలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పెందుర్తిలో వేంజేసిన మరిడిమాంబ అమ్మవారి ముఖ ద్వారం(గుమ్మం) పెట్టే కార్యక్రమాన్ని శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రామునాయుడు, శరగడం నరసింహమూర్తి, రొంగలి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ క్లీనర్ అదృశ్యం



విజయకుమార్

పరవాడ: లంకెలపాలెం సంతోష్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం వద్ద లారీలో పడుకున్న క్లీనర్ ఎం.విజయ్‌కుమార్ కనిపించడం లేదని లారీ డ్రైవర్ శాంతరాజు పరవాడ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన క్లీనర్ విజయ్‌కుమార్ చీరాల జిల్లా బాపట్ల ప్రసాద్‌నగర్‌కు చెందిన వ్యక్తిగా పేర్కొన్నాడు. వివరాలిలా ఉన్నాయి....ఈ నెల 6న గుంటూరు జిల్లా నరసారావుపేటలో ఉదయం 8.30 గంటలకు గేదెల దాణా లోడుతో డ్రైవర్ శాంతరాజు, క్లీనర్ విజయకుమార్ బయలుదేరి సబ్బవరం, ఆనందపురం ప్రాంతాల్లో అన్‌లోడ్ చేశారు. తిరిగి ఈ నెల 8వతేదీ సాయంత్రం లంకెలపాలెం సంతోష్ ట్రాన్స్‌పోర్టుకు చేరి లోడు ఏమీ లేకపోవడంతో రాత్రికి అక్కడే పడుకున్నారు. మరుసటి రోజు కూడా లోడు లేని కారణంగా డ్రైవర్ ఆఫీసులో పడుకోగా క్లీనర్ లారీలో పడుకున్నాడు. ఉదయం డ్రైవర్ శాంతరాజు లేచి చూడగా క్లీనర్ కనిపించలేదని డ్రైవర్ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు పరవాడ సీఐ ఈశ్వరరావు 9440796038 నంబర్‌కు సమాచారం అందించాలని స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కోరారు.